ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సిద్దిపేట

గురువారం 19 సెప్టెంబరు 2024



5

మైదానం లేక.. మరుగున ఆట
- కలగానే గజ్వేల్‌కు స్టేడియం..
- ఏళ్లుగా క్రీడాకారులకు తప్పని ఎదురుచూపులు
- మినీస్టేడియం ఉన్నా.. వసతులు సున్నా..
- భూమి కేటాయించినా.. ఫలితం శూన్యం

7

ఓటరు జాబితా తయారీకి సహకరించాలి

- కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 18: గ్రామపంచాయతీ ఓటరు జాబితా తయారీకి రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. రాను న్న గ్రామపంచాయతీ ఎన్నికల ఓటరు జాబితా తయారీపై చర్చించి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడారు. ఈనెల 13న జిల్లాలోని 491 గ్రామపంచాయతీల్లో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించామన్నారు. చివరి ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులకూ అవకాశం లేకుండా సమర్థవంతంగా తయారు చేసేందుకు డ్రాఫ్ట్ ఓటరు జాబితాను రాజకీయ పార్టీలు పరిశీలించి ఈనెల 21 వరకు సలహాలు, సూచనలను పంచాయతీ సెక్రటరీలు, ఎం పీడీవో కార్యాలయాల్లో అందించాలని కోరారు. రేపు మండల స్థాయిలో నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సూచనలు, సలహాలను పరిశీలించి ఈనెల 28న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు చెప్పారు. సిద్దిపేట రూరల్ మండలం నుంచి నారాయణరావుపేట మండలంలోకి మారిన 15 గ్రామపంచాయతీలు, ఏడు పునరావాస కాలనీల గ్రామపంచాయతీలకు ప్రభుత్వం నుంచి సవరణ రాగానే వాటికి కూడా డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ జారీ చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు ఒక కుటుంబానికి చెందిన ఓటర్లను ఒకే పోలింగ్ బూత్ పరిధిలో ఉండాలని కోరారు. అలాగే ఒక పోలింగ్ బూత్‌లో 500 మందికి మించకూడదని, కులగణన నిర్వహించి రిజర్వేషన్లను గుర్తించిన తర్వాతనే గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్, జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, జడ్పీ సీఈవో రమేష్, డివిజనల్ పంచాయతీ అధికారి మల్లికార్జున్, వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

గణేష్ నిమజ్జన వేడుకల్లో జగ్గారెడ్డి

- పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, కుమారుడు దత్తుసాయిరెడ్డి, కూతురు జయారెడ్డి
- సంగారెడ్డిలో జోష్ నింపిన మాజీ ఎమ్మెల్యే



సంగారెడ్డి అంబేడ్కర్ జంక్షన్‌లో స్వయంగా ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి, సెప్టెంబరు 18 : సంగారెడ్డి పట్టణంలో మంగళవారం వైభవంగా జరిగిన గణేష్ నిమజ్జన వేడుకల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పాల్గొన్నారు. నిమజ్జన ర్యాలీలో సందడి చేశారు. ఎక్కడికక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో స్వయంగా ఆయనే నియంత్రించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించారు. ఆర్కెస్ట్రా బృందాలు, డప్పుచప్పుళ్ల మధ్య కాలు కదుపుతూ జోష్ నింపారు. చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలోని గణపతి లడ్డూను జగ్గారెడ్డి కుమారుడు దత్తు సాయిరెడ్డి, రూ.15లక్షలకు దక్కించుకున్నారు. టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, కుమారుడు దత్తు సాయిరెడ్డి, కుమార్తె జయారెడ్డి లడ్డూ ప్రసాదాన్ని స్థానికులకు పంచిపెట్టారు.





సంగారెడ్డిలోని చైతన్య యువజన సంఘం ఏర్పాటు చేసిన గణపతి లడ్డుతో టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, కుమారుడు దత్తుసాయిరెడ్డి, కూతురు జయారెడ్డి

ఐబీ గెస్ట్‌హౌజ్ నిమజ్జన ర్యాలీలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

ఆగుతూ.. సాగుతూ

- మొదలైన 'ఎల్ఆర్ఎస్' దరఖాస్తుల పరిశీలన
- పనిచేయని దరఖాస్తుదారుల ఫోన్ నంబర్లు
- వెంటాడుతున్న సాంకేతిక సమస్య
- సవాల్‌గా మారిన ప్రక్రియ

కోహెడ, సెప్టెంబరు 18 : నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్న అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల ప్రక్రియ జిల్లాలో మొదలైనా.. ఆటంకాలు మాత్రం తప్పడం లేదు. ప్రభుత్వం ఇటీవల గ్రీన్‌ఇవ్వడంతో దరఖాస్తుల పరిశీలనను ప్రత్యేక బృందాలు ప్రారంభించాయి. అయితే దరఖాస్తు సమయంలో ప్లాట్ల యజమానులు ఇచ్చిన మొబైల్ నంబర్లు కొన్ని పనిచేయకపోవడంతో అధికారులు పరిశీలన వచ్చేప్పుడు ముందస్తుగా తెలిపే అవకాశం ఉండడం లేదు. మరికొందరు దరఖాస్తు చేసుకున్న సమయంలో సెల్ నంబర్లు రాయలేదు. 2020లో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ పలువురు ప్లాట్లను ఇతరులకు అమ్ముకున్నారు. వారి వివరాలు అందుబాటులో లేవు. దీనికి తోడు ప్లాట్ల వివరాలు నమోదు చేయాల్సిన యాప్ సర్వర్ సైతం డౌన్ అవుతుండడంతో సాంకేతికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దరఖాస్తుదారులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పరిశీలనకు వచ్చే బృందానికి సహకరిస్తే ప్రక్రియ త్వరితగతిన పూర్తయ్యే అవకాశం ఉంటుంది.

వివరాల సేకరణ

పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియను క్షేత్రస్థాయిలో చేపట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో రెవెన్యూశాఖ ఆర్ఐ, మండల పంచాయతీ అధికారి, నీటిపారుదలశాఖ ఏఈఈ, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు. అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలోకి వెళ్లి దరఖాస్తుదారులకు సంబంధించిన ప్లాట్లను పరిశీలిస్తున్నారు. ప్లాట్ ఫొటో, నంబర్, సర్వే నంబర్, ప్లాట్ హద్దులను పరిశీలించి వాటి పూర్తి వివరాలను ఎల్ఆర్ఎస్ 2020 యాప్‌లో నమోదుతో పాటు జియో లోకేషన్ చేసి అధికారులకు పంపుతున్నారు. జిల్లాలోని 23 మండలాల్లో 47 బృందాలతో 21,401 దరఖాస్తులను, సుడా పరిధిలో 21,338 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించనున్నారు.



కోహెడలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్లాటు కొలతలు తీసుకుంటున్న అధికారులు



స్వచ్ఛందంగా ముందుకు రావాలి

- శోభ ఎంపీవో కోహెడ



ఎల్ఆర్ఎస్ కోసం 2020లో రూ.వెయ్యి చెల్లించి దరఖాస్తు చేసుకున్న వారు స్వచ్ఛందంగా ముందుకొచ్చి అధికారులకు సహకరించాలి. పరిశీలనకు వచ్చిన సమయంలో రిజిస్టర్ డాక్యుమెంట్స్, ఎల్ఆర్ఎస్ దరఖాస్తు రసీదు, లింక్ డాక్యుమెంటు తప్పనిసరిగా చూపించాలి. ప్లాట్లను విక్రయించిన వారు కూడా ఎల్ఆర్ఎస్ తమ పేరిట చేసుకోవచ్చు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు మండలాలు, మున్సిపాలిటీల వారీగా

మండలం	దరఖాస్తులు
కొమురవెల్లి	5320
చిన్నకోడురు	2704
జగదేవపూర్	2178
బెజ్జంకి	1006
చేర్యాల	1084
కొండపాక	1822
వర్గల్	1072
దౌల్తాబాద్	281
దుబ్బాక	408
గజ్వేల్	521
హుస్నాబాద్	773
కోహెడ	990
మద్దూర్	115
మర్కుక్	218
మిరుదొడ్డి	810
సిద్దిపేట	839
నంగునూరు	676
తొగుట	203
నారాయణరావుపేట	114
ములుగు	16
అక్కన్నపేట	80
రాయపోల్	81
సిద్దిపేట అర్బన్	90
మున్సిపాలిటీ	**దరఖాస్తులు**
సిద్దిపేట	7,240
గజ్వేల్	1,697
చేర్యాల	1084
హుస్నాబాద్	566
దుబ్బాక	567

ప్రాణం తీసిన కంచె

- విద్యుత్ షాక్‌తో రైతు మృతి



మృతి చెందిన వెంకటయ్య

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 18: పంట రక్షణకు వేసిన ఇనుప కంచెకు తగిలి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై రైతు మృతి చెందిన సంఘటన బుధవారం నారాయణరావుపేట మండలం గోపులాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, చిన్నకోడురు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నిరుగొండ వెంకటయ్య (48) తనకున్న వ్యవసాయ భూమిలో మొక్కజొన్న పంట వేశాడు. అడవి జంతువుల నుంచి పంట రక్షణకు చుట్టూ ఇనుప వైరును కంచెగా ఏర్పాటు చేశాడు. బుధవారం వ్యవసాయ భూమి వద్దకు వెళ్లిన వెంకటయ్య ఎంతకూ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా చనిపోయి కనిపించాడు. పంటకు రక్షణగా వేసిన కంచెకు విద్యుత్ ప్రసారం జరిగి.. దానిని తగిలి షాక్‌తో మృతి చెందినట్లు నిర్ధారించారు. చిన్నకోడురు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.10 వేలు ఇవ్వు.. పెన్షన్ ఇప్పిస్తా

- వృద్ధుడిని మోసం చేసిన గుర్తుతెలియని వ్యక్తి



బ్యాంకు సీసీ కెమెరాల్లో వృద్ధుడిని మోసం చేసిన వ్యక్తి

బెజ్జంకి, సెప్టెంబరు 18: "రూ.4వేల పెన్షన్ ఇప్పిస్తా నంటూ గుర్తుతెలియని వ్యక్తి ఓ వృద్ధుడి దగ్గర నుంచి రూ.10వేలు తీసుకుని పరారైన సంఘటన బెజ్జంకి మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో బుధవారం చోటుచేసుకున్నది. ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుండారం గ్రామానికి చెందిన లక్ష్మీపతి అనే వృద్ధుడు మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఉన్న ఖాతా నుంచి డబ్బు తీసుకునేందుకు వచ్చాడు. నగదు డ్రా చేసేందుకు సహాయం చేస్తానంటూ గుర్తుతెలియని వ్యక్తి వృద్ధుడితో నమ్మబలికాడు. అనంతరం వృద్ధుడితో డబ్బు విత్‌డ్రా చేయించాడు. తాను పంచాయతీ సెక్రటరీనని పరిచయం చేసుకున్నాడు. మాటలు కలిపాక.. రూ.4వేల పెన్షన్ ఇప్పిస్తానని వృద్ధుడిని నమ్మించాడు. అందుకు రూ.10వేలు ఇవ్వాలని కోరాడు. ఆ వ్యక్తి చెప్పిన మాటలు నమ్మి వృద్ధుడు డబ్బు ఇవ్వగానే కాసేపటికి అతను అక్కడి నుంచి జారుకున్నాడు. సదరు వ్యక్తి బ్యాంకులో కనిపించక పోవడంతో మోసపోయానని గ్రహించిన లక్ష్మీపతి బెజ్జంకి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. బ్యాంకుల్లో డబ్బు తీసుకునేందుకు వచ్చే ప్రజలు గుర్తుతెలియని వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూచించారు.

అనుమానం.. పెనుభూతమై..
- క్షణికావేశంలో నిండు ప్రాణం బలి

7

బంగారం కొంటానని వచ్చి.. ట్రే బాక్సుతో పరుగు

- వెంబడించిన దొరకని వైనం

సిద్దిపేట క్రైం, సెప్టెంబర్ 18: బంగారం కొంటానని షాపులోకి వెళ్లి బంగారు నగల ట్రే బాక్సుతో యువకుడు పరారైన సంఘటన సిద్దిపేట జిల్లా కేంద్రంలో బుధవారం జరిగింది. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట పట్టణంలోని లాల్‌కమాన్ వద్ద ఉన్న నయిమ్‌మియా జువెల్లరి షాపునకు బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి బంగారు గొలుసు కావాలని వచ్చాడు. షాపులో అన్ని గమనించాడు. నగ కొనుగోలు చేస్తున్నట్లు అన్ని చూశాడు. షాపులో ఉన్న గుమాస్తా 5 బంగారం చైన్లు ఉన్న ట్రే బాక్సును ముందుపెట్టి చూపెడుతున్నాడు. ఈ క్రమంలో సుమారు 8 తులాలు ఉన్న బంగారం ట్రే బాక్స్ తీసుకుని పరుగు తీశాడు. గమనించిన షాపు సిబ్బంది వెంబడించారు. నిందితుడు పథకం ప్రకారం పక్క సందులో పెట్టిన స్కూటీపై పారిపోయాడు. షాపు సిబ్బంది ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. యజమానులు వెంటనే టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని షాపులో ఉన్న సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించారు.



చోరీ జరిగిన దుకాణం

తాగిన మైకంలో ర్యాష్ డ్రైవింగ్

- బైక్ అదుపు తప్పి యువకుడి మృతి
- ఒకరికి తీవ్రగాయాలు.. పరారీలో మరొకరు

చేర్యాల, సెప్టెంబరు 18 : తాగిన మైకం.. ట్రిబుల్ రైడింగ్.. ఆపై ర్యాష్ డ్రైవింగ్ వల్ల బైక్ అదుపు తప్పిన ఘటనలో జగదేవ్‌పూర్ మండలానికి చెందిన యువకుడు ప్రాణాలు కోల్పోయాడు..

జగదేవ్‌పూర్ మండలం మునిగడపకు చెందిన బోనకొల్లూరు కార్తీక్ (19), మునిగడపకు చెందిన నవీన్, చేర్యాలలోని గట్టుతోట శివారు కాలనీకి చెందిన యాట రాజు స్నేహితులు. వీరు బుధవారం సాయంత్రం కొండపోచమ్మ ఆలయ సమీపం నుంచి బైక్‌పై చేర్యాల వైపునకు వస్తున్నారు. అతివేగంగా బైక్ నడుపుతున్న క్రమంలో మార్గ మధ్యలోని కొమురవెల్లి మండలం పోసాన్‌పల్లి శివారులోని మూలమలుపు వద్ద అదుపుతప్పడంతో కిందపడిపోయారు. దీంతో కార్తీక్ అక్కడికక్కడే చనిపోయాడు. యాట రాజు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనతో భయాందోళన గురైన మునిగడపకు చెందిన నవీన్ పరారయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్ఐ రాజు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కార్తీక్ మృతదేహాన్ని చేర్యాల మార్చురీకి తరలించారు. రాజును చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కొండపోచమ్మ సమీపంలో సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించగా ముగ్గురు కలిసి మద్యం సేవించడాన్ని గుర్తించారు. తాగిన మైకంలో బైక్‌పై అతివేగంగా ప్రయాణించారని స్థానికులు పేర్కొన్నారు.



కార్తీక్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు



తీవ్రంగా గాయపడిన రాజు

స్త్రీ నిధి.. అతివల పెన్నిధి

- మహిళా సంఘాలకు తోడుగా రుణాలు
- సభ్యులు కోరిన రెండు రోజుల్లోనే..
- ఈ ఏడాది రూ.71.30 కోట్లకు రూ. 21.32 కోట్లు మంజూరు

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 18 : మహిళా స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక సాధికారత వైపు అడుగులు వేస్తున్నారు. పొదుపు కొలమానంగా బ్యాంక్ రుణాలు పొందుతూ తమ కుటుంబాలను చక్కదిద్దుకుంటున్నారు. బ్యాంక్ లింకేజీతో పాటు అత్యవసర వేళల్లో 'స్త్రీనిధి' రుణాలు బాసటగా నిలుస్తున్నాయి. సభ్యులు కోరిన 48 గంటల్లోపు రుణం మంజూరు చేయడంతో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. అయితే, జిల్లాలో రుణ లక్ష్య ప్రగతి బాగానే ఉన్నప్పటికీ రికవరీలో మాత్రం కాస్త వెనకబడింది. ఈ ఏడాది లక్ష్యాలు చేరుకునేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఈ ఏడాది రూ.71.30 కోట్లకు గాను.. రూ.21.32 కోట్ల రుణాలు అధికారులు మంజూరు చేశారు.



మెప్మా, ఐకేపీ స్త్రీనిధి రుణాలపై అవగాహన కల్పిస్తున్న స్త్రీనిధి ఆర్ఎం రామ్మోహన్

రుణాలు ఇలా..

సూక్ష్మ రుణాల వడ్డీ వ్యాపారుల బారి నుంచి రక్షించి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు 2011లో స్త్రీనిధి ప్రారంభమైంది. నాటి నుంచి స్వశక్తి సంఘాల మహిళలకు సువిధ, ప్రగతి, అక్షయ, సౌభాగ్య, సౌందర్య పేరిట రూ.50 వేల నుంచి రూ.5లక్షల వరకు రుణాలు ఇచ్చేవారు. అత్యవసర పరిస్థితుల్లో రుణాలు తీసుకుని వాయిదాలను సకాలంలో చెల్లించిన సంఘాలకు పావలా వడ్డీ వర్తిస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో ఆర్థికంగా చేయూనిస్తున్న స్త్రీనిధి రుణాల వసూలు మాత్రం కొంత ఆందోళన కలిగిస్తోంది. పట్టణ ప్రాంతాల్లో (మెప్మా)లో రూ.9.75 కోట్లు, ఐకేపీ రూ.20కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటివరకు ఐకేపీ 40 శాతం, మెప్మా 76 శాతం మాత్రమే వసూలు అయ్యాయి. ఇదే సమయానికి గత ఏడాది ఐకేపీ 66 శాతం, మెప్మా 80 శాతం వసూలు అయ్యాయి. మెప్మాలో వసూళ్లు మెరుగ్గా ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు రుణాలను తిరిగి చెల్లించడంలో వెనుకంజ వేస్తున్నారు.

సమస్యలను అధిగమిస్తున్నాం..



మహిళలకు వ్యక్తిగతంగా, అత్యవసరంగా రుణాలను స్త్రీనిధిలో మంజూరు చేస్తున్నాం. వసూళ్లలో జిల్లాలోని పది మండలాల్లో మాత్రమే కొంత వెనుకబడింది. రుణాల వసూళ్లపై ప్రణాళిక రూపొందించాం. లక్ష్యాలు చేరుకునేందుకు సమస్యలను అధిగమిస్తున్నాం.

- జయదేవ్ ఆర్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

బై బై గణేషా









సిద్దిపేట గణేష్‌నగర్‌లో ఏర్పాటు చేసిన గణనాథులను బుధవారం నిమజ్జనానికి తరలించారు. నిమజ్జన శోభాయాత్ర అట్టహాసంగా చేపట్టారు. శోభాయాత్రలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మహిళల కోలాటాలు, పోతరాజుల వేషాలు, పాటలు డాన్స్‌ల మధ్య శోభాయాత్ర సాగింది. సింగర్ తెలంగాణ తేజు ప్రియా హుషారెత్తించే ఆటపాటలతో మరింత జోష్ నిండింది.

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 18

తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి

రేగోడు సెప్టెంబరు 18: ప్రతి సోమవారం కలేక్టర్ కార్యలయంలో జరిగే ప్రజావాణి ఇక నుంచి తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతుందని రేగోడు తహసీల్దార్ బాలలక్ష్మి తెలిపారు.

గ్రామ పంచాయతీ వర్కర్ల ధర్నా

మునిపల్లి, సెప్టెంబరు18 : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ వర్కర్లు బుధవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా కార్యదర్శి దశరథ్, మండల అధ్యక్షుడు ఇస్మాయిల్ మాట్లాడుతూ మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు చెల్లించాలన్నారు. ప్రమాదబీమా సౌకర్యం కల్పించడంతోపాటు ఐడీ కార్డు సబ్బులు, సరుకులు, సంవత్సరానికి రెండు జతలబట్టలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ రామలింగంకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి విఠల్ గౌడ్, రవి, యాదమ్మ, నగేష్, ప్రభాకర్, నవీన్, బిక్షపతి, బాగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 18 :విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం పట్టణానికి చెందిన చొప్పదండి శ్రీనివాస్, లావణ్య ఎన్జీవోస్‌కాలనీలో అద్దెఇంట్లో నివాసముంటున్నారు. బుధవారం మధ్యాహ్నం దుస్తులు ఉతికి ఇంటి ఎదుట ఆరేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు కేసు దర్యాప్తులో ఉంది.



సంగారెడ్డిలోని రాజంపేట రోడ్డులో అర్థాంతరంగా నిలిచిన నర్సింగ్ కాలేజీ భవన నిర్మాణ పనులు

పైసలు లేక.. పనులు సాగక

● అర్ధాంతరంగా నిలిచిన నర్సింగ్ కాలేజీ భవన నిర్మాణాలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 18 : సంగారెడ్డిలోని రాజంపేట రోడ్డులో నిర్మిస్తున్న నర్సింగ్ కాలేజీ నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. మూడు నెలలుగా పనులు కొనసాగడం లేదు. పూర్తి చేసిన పనులకు సైతం ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో మిగిలిన పనులను కొనసాగించడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సొంత జిల్లాలో ఈ పరిస్థితులు ఉండడం గమనార్హం.

పనులు చేసినా నయా పైసా రాలే !

రెండంతస్తుల నర్సింగ్ కాలేజీ భవనం, రెండంతస్తుల హాస్టల్ భవన నిర్మాణాలకు ప్రభుత్వం గత ఏడాదిలో రూ.34 కోట్లు మంజూరు చేసింది. వీటి నిర్మాణ బాధ్యతలను ప్రభుత్వ ఏజెన్సీ అయిన టీజీఎంఎస్ఐడీసీ చేపట్టింది. కాంట్రాక్టర్‌ను ఎంపిక చేసుకుని అగ్రిమెంట్ కుదుర్చుకున్నది. ఈ ఒప్పందం ప్రకారం నర్సింగ్ కాలేజీ, హాస్టల్ భవన నిర్మాణాలన్నీ వచ్చే అక్టోబరులో పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించాలి. అయితే గతేడాది జూలైలోనే కాంట్రాక్టరు రూ.10 కోట్ల పనులను పూర్తి చేశారు. ఇప్పటి వరకు ప్రభుత్వం ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు. దాంతో మిగిలిన నిర్మాణాలను ఎలా చేపట్టాలంటూ సదరు కాంట్రాక్టర్ ప్రశ్నిస్తున్నారు. పైసలు మంజూరు చేస్తేనే మళ్లీ పనులు ప్రారంభిస్తామని అప్పటి వరకు పనులు మొదలు పెట్టేది లేదని తేల్చిచెబుతున్నారని అధికారులు పేర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితులపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పందించి ప్రభుత్వం నుంచి నిధులను విడుదల చేయించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పిల్లర్ల దశలో నిలిచిన నర్సింగ్ కాలేజీ హాస్టల్ భవనాలు

మైదానం లేక.. మరుగున ఆట

- కలగానే గజ్వేల్‌కు స్టేడియం..
- ఏళ్లుగా క్రీడాకారులకు తప్పని ఎదురుచూపులు
- మినీస్టేడియం ఉన్నా.. వసతులు సున్నా..
- గత ప్రభుత్వం భూమి కేటాయించినా.. ఫలితం శూన్యం



స్టేడియం నిర్మాణానికి ఇటీవల ప్రభుత్వం కేటాయించిన స్థలం

గజ్వేల్, సెప్టెంబరు 18: గజ్వేల్ పట్టణ, నియోజకవర్గ క్రీడాకారుల చిరకాల ఆశ నెరవేరడం లేదు. గజ్వేల్ ఎంతో అభివృద్ధి జరిగిందని గతంలో అధికార , ప్రతిపక్ష నాయకుల నోళ్లలో నానినా గజ్వేల్‌కు క్రీడా మైదానం మాత్రం దక్కడం లేదు. గత ప్రభుత్వం గజ్వేల్‌లో ఆధునిక హంగులతో స్టేడియం ఏర్పాటు చేస్తామని ప్రకటించి, ప్రస్తుతం ఉన్న మినీ స్టేడియానికి ఆనుకుని ఉన్న ఆరు ఎకరాల భూమిని సేకరించింది. అయినా ఇప్పటికీ ఆ భూమికి హద్దులు కూడా చూపించలేదు. దీంతో స్టేడియం లేక క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. క్రీడామైదానంతో పాటు క్రీడా సామాగ్రి అందజేస్తే యువతీ, యువకులు ప్రాక్టీసు చేసే వెసులుబాటు ఉంటుంది. కానీ పట్టణ విస్తరణ పెరిగినప్పటికీ ప్రజలకు అవసరమైన స్టేడియం, క్రీడాప్రాంగణం లేదు. ఇక మినీ స్టేడియం ఉన్నా అందులో వసతులు లేకపోవడంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే స్టేడియంలో ఆర్టీఏ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు.

క్రీడల్లో వెనకబడుతున్న గజ్వేల్ యువత

గజ్వేల్ పట్టణంతో పాటు నియోజకవర్గవ్యాప్తంగా అనేక క్రీడల్లో నైపుణ్యం కలిగిన యువత ఉన్నారు. అయితే సరైన మైదానం, క్రీడా శిక్షకులు లేకపోవడంతో యువతలోని నైపుణ్యం మరుగున పడుతున్నది. గజ్వేల్‌లో క్రీడా మైదానం ఏర్పాటు చేస్తే గజ్వేల్ నియోజకవర్గంతో పాటు దుబ్బాక నియోజకవర్గ యువ క్రీడాకారులకు ఎంతగానో ఉపయోగపడనుంది.

ఆర్‌టీఏ కార్యాలయంగా మినీ స్టేడియం..

గజ్వేల్ పట్టణంలోని తూప్రాన్ రోడ్డులో మినీ స్టేడియం ఉన్నా పెద్దగా ప్రయోజనం లేదు. పట్టణానికి దూరంగా ఉండడం, రాత్రైతే ఆ ప్రాంతంలో ఎవరూ ఉండకపోవడం, చుట్టూ మందుబాబులు సిట్టింగ్ వేస్తుండడంతో క్రీడాకారులు ఆ స్టేడియానికి వెళ్లాలంటేనే జంకుతున్నారు. సరైన రవాణా సౌకర్యం లేకపోవడం ప్రధాన సమస్యగా చెప్పవచ్చు. ఇకపోతే ప్రస్తుత మినీ స్టేడియంలో గజ్వేల్ ఎంవీఐ కార్యాలయం ఏర్పాటు చేశారు. ప్రతి మంగళవారం, శుక్రవారం ఇక్కడ పూర్తి స్థాయిలో ఆర్టీఏ సేవలు అందుబాటులో ఉంటుండడంతో క్రీడాకారులకు సమస్యగా మారింది.

పట్టణంలో అందుబాటులో లేని స్థలం

గజ్వేల్‌తో పాటు ప్రజ్ఞాపూర్‌లో సైతం ఎక్కడా క్రీడా మైదానం నిర్మాణానికి ప్రభుత్వం స్థలం అందుబాటులో లేకపోవడం పెద్ద మైనస్. గతంలో గ్రామపంచాయతీగా ఉన్న సమయంలోనే స్టేడియం నిర్మాణానికి స్థలాన్ని అన్వేషించినా ఎక్కడా స్థలం లభించకపోవడంతో తూప్రాన్ రోడ్డులో మినీ స్టేడియాన్ని ఏర్పాటు చేశారు. ఈ స్టేడియం ఏర్పాటుకు గజ్వేల్ క్రీడాకారులు, యువజన సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమాలే చేయాల్సి వచ్చింది. ఎట్టకేలకు స్టేడియం నిర్మాణం జరిగినా పూర్తిస్థాయిలో ఆటవస్తువులు లేకపోవడం, అన్ని క్రీడలకు సరిపడా స్థలం లేకపోవడంతో క్రీడల నిర్వహణ ఇబ్బందిగా మారింది. ప్రస్తుతానికి పలువురు వాకర్స్, క్రికెట్, ఇతర క్రీడలను శివాలయానికి సంబంధించిన మైదానంలోనే నిర్వహిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా స్పందించి క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయాలని స్థానిక యువతీ, యువకులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు కోరుతున్నారు.



మినీ స్టేడియంలో కొనసాగుతున్న ఆర్‌టీఏ కార్యాలయం

గజ్వేల్ పట్టణంలోని ప్రస్తుత మినీ స్టేడియం

క్రీడా పాలసీకి దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 18 : క్రీడా పాలసీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడా అధికారి మొగల్ ఖాసీం బేగ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తెలంగాణ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఎండీ ఆదేశాల మేరకు క్రీడా పాలసీని రూపొందించిందని పేర్కొన్నారు. 2019 నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులు తమ వివరాలను కలెక్టరేట్‌లోని జిల్లా యువజన, క్రీడా కార్యలయంలో ఈ నెల 24వ తేదిలోగా సమర్పించాలని తెలిపారు. పోటీల్లో పాల్గొన్న వివరాలు, పొందిన పతకాలు, ధ్రువపత్రాలు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో దరఖాస్తులను వ్యక్తిగతంగా అందజేయాలని సూచించారు. క్రీడాకారులు సమర్పించే సమాచారాన్ని కోచ్, పీడీ, పీఈటీలు ధ్రువీకరించాల్సి ఉంటుందని, పూర్తి వివరాలకు 7981798957 నంబర్ ద్వారా సంప్రదించాలని పేర్కొన్నారు.

ట్రాక్టర్‌ను చోరీ చేసి.. బావిలో పడేసి..

తూప్రాన్, సెప్టెంబరు 18: దుండగులు ట్రాక్టర్‌ను చోరీ చేసి బావిలో వేసిన సంఘటన తూప్రాన్ మండలం కిష్టాపూర్‌లో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన ఉడుగుల శ్రీనివాస్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. యావాపూర్‌కు చెందిన సత్తయ్య పొలం కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. మంగళవారం ఎప్పటిలాగే కిష్టాపూర్ శివారులో మేకల కొట్టం వద్ద ట్రాక్టర్‌ను ఉంచాడు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్‌ను ట్రాలీతో సహా తీసుకెళ్లి శ్రీనివాస్ కౌలుకు చేస్తున్న పొలం వద్దగల బావిలో పడేశారు. బుధవారం ట్రాక్టర్ కనిపించకపోవడంతో టైర్ల జాడల ఆధారంగా వెతకగా బావిలో కనిపించింది. ఈ మేరకు బాధితుడు బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఏటీఎంలో డ్రా చేయమంటే.. డబ్బులు కాజేశాడు

తూప్రాన్, సెప్టెంబరు 18 : ఏటీఎం నుంచి డబ్బులు డ్రా చేసి ఇవ్వమన్నందుకు ఏటీఎం కార్డునే మార్చేసి డబ్బులు కాజేశాడు ఓ ప్రబుద్ధుడు. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన వడ్ల గున్నాలు ఈ నెల 8న ఎస్‌బీఐ ఏటీఎంలో డబ్బులు డ్రా చేసుకోవడానికి వచ్చాడు. డబ్బులు చేయడం తెలియకపోవడంతో ఏటీఎం వద్దకు వచ్చిన గుర్తు తెలియని వ్యక్తిని డబ్బులు డ్రా చేసి ఇవ్వాలని ఏటీఎం కార్డు ఇచ్చాడు. అతడు డబ్బులు డ్రా చేసినట్లు ప్రయత్నించి ఏటీఎం కార్డు పని చేయడంలేదంటూ చెప్పి కార్డు (కార్డు మార్చి) ఇచ్చి వెళ్లిపోయాడు. వేరే వ్యక్తుల సహాయంతో ఏటీఎం నుంచి డబ్బులు డ్రా చేసేందుకు ప్రయత్నించినప్పటికీ డబ్బులు రాలేదు. బుధవారం గున్నాలు ఎస్‌బీఐ బ్యాంకు వచ్చి డబ్బులు డ్రా చేసేందుకు చూడగా, 8న రూ. 9,600 డ్రా చేసినట్లు గుర్తించాడు. ఈ విషయంలో గున్నాలు తూప్రాన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడి బ్రెయిన్‌డెడ్

- అవయవాలు దానం చేసిన కుటుంబం



మురుగేంద్ర స్వామి (ఫైల్)

నర్సాపూర్, సెప్టెంబరు 18: అత్యంత సాధారణ కుటుంబం ఎంతో ఉన్నతంగా ఆలోచించి ఆదర్శంగా నిలిచింది. బ్రెయిన్‌డెడ్ అయిన తమ కుటుంబ సభ్యుడి అవయవాలు అంత దుఃఖంలోనూ దానం చేయగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్లితే మెదక్ జిల్లా నర్సాపూర్‌లో నివాసముంటున్న మురుగేంద్రస్వామి(45) స్థానికంగా మిర్చిల బండి పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన తీవ్ర గాయాలకు గురికాగా హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రిలో తరలించారు. చికిత్స అందించిన వైద్యులు మురుగేంద్రస్వామి బ్రెయిన్ డెడ్ అయినట్టు నిర్ధారించారు. దీంతో అతని కుటుంబీకులు జీవన్‌దాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవయవాలు దానం చేసేందుకు అంగీకరించారు. మృతిడికి భార్య లక్ష్మితో పాటు కూతురు, కుమారుడు ఉండగా కూతురుకు వివాహం జరిగింది.

భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదని యువరైతు ఆత్మహత్య



కాముని రాజు (ఫైల్)

తొగుట, సెప్టెంబరు 18: యువ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన తొగుట మండలం కాన్గల్ గ్రామంలో చోటుచేసుకుంది. తొగుట పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కాముని రాజు (31)కు పోసానిపల్లి గ్రామానికి చెందిన భవాని అలియాస్ దివ్యతో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. కొన్ని రోజుల క్రితం దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో దివ్య పుట్టింటికి వెళ్లిపోయింది. దాంతో రాజు మద్యానికి బానిసగా మారాడు. ఇక తన భార్య రాదేమోనని భావించి మంగళవారం రాత్రి వ్యవసాయ బావివద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చస్తున్నట్లు తొగుట ఎస్‌ఐ రవికాంత్ రావు తెలిపారు.

తల్లితో గొడవపడి యువకుడు..



మధు(ఫైల్)

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 18 : తల్లితో గొడవపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట పట్టణంలోని రామ్‌నగర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే రామ్‌నగర్‌కు చెందిన జిల్లా పద్మ చిన్న కుమారుడు జిల్లా మధు(28)తో కలిసి గుండ్ల చెరువు ప్రాంతంలో నివసిస్తుంది. డెకొరేషన్ పనులు చేసే మధు మద్యానికి బానిసై డబ్బుల కోసం నిత్యం తల్లితో గొడవ పడేవాడు. మంగళవారం కూడా మద్యం తాగివచ్చి డబ్బులివ్వాలని తల్లితో గొడవపడగా తల్లి ఇవ్వలేదు. దీంతో మనస్తాపానికి గురైన మధు పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు అతడిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలి

- డీపీఎం ప్రకాష్



మాట్లాడుతున్న డీపీఎం ప్రకాష్

చేగుంట, సెప్టెంబరు 18 : డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదుగాలని డీపీఎం ప్రకాష్ అన్నారు. బుధవారం నార్సింగి మండల కేంద్రంలోని ఏడవ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మహిళల సంఘాలకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు బ్యాంకు రుణాలు పొంది కుటీర పరిశ్రమలు, తదాతర ఉపాధి కల్పించుకోవాలని సూచించారు. రుణాలు పొందిన సకాలంలోనే కొత్తవారికి బ్యాంకు రుణాలు కల్పించేందుకు కృషి చేయాలని సీసీలకు ఆదేశాలు జారీ చేశారు. బ్యాంకు లింకేజీల ద్వారా స్త్రీనిధి రుణాలను సక్రమంగా పొందేందుకు సహకరించాలని కోరారు. 15 గ్రామల్లోని 375 మహిళా సంఘాలకు 3750 సభ్యుల వార్షిక ఆదాయాన్ని మహిళా అధ్యక్షురాలు మైలారం అనిత డీపీఎంకు వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం అశోక్, సీసీలు సుల్తాన, శంకర్, ఆయా గ్రామాల మహిళా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

టేక్మాల్, సెప్టెంబరు18 : పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శిశు సంక్షేమ శాఖ అధికారులు రమేష్, కవిత అన్నారు. బుధవారం మండలంలోని జూనియర్ కళాశాలలో శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నారులను లైంగిక వేధింపుల నుంచి రక్షించడానికి ఏర్పాటు చేసిన పోక్సో చట్టం గురించి ఉదాహరణతో సహా వివరించారు. ఈ చట్టం అమల్లోకి వచ్చి 10 ఏళ్ల అయినా ఇంకా ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం ఎంతో బాధాకరమని అన్నారు. శారీరకంగా, మానసికంగా చిన్నారులు ఆనందకరమైన బాల్యాన్ని పొందడం వారి హక్కు అన్నారు. లైంగిక వేధింపులపై ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుభాష్‌చంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో ద్విచక్రవాహనం చోరీ

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 18 : బైకు చోరీకి గురైంది. వివరాల్లోకి వెళ్లితే సంగారెడ్డి పట్టణంలోని గంజిమైదానంలో గల నుమానియా మసీదు ఇమామ్ రహ్మతుల్లాకు చెందిన టీఎస్15 బీఈఆర్ 4785 నంబరు గల ద్విచక్రవాహనాన్ని ఈ నెల 16న గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఈ మేరకు బాధితుడు సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేసి నిందితుడిని గుర్తించి తన ద్విచక్రవాహనాన్ని ఇప్పించాలని బాధితుడు ఫర్యాదులో కోరారు.

అనుమానం.. పెనుభూతమై..

- క్షణికావేశంలో నిండు ప్రాణం బలి



అనూష(ఫైల్)

మర్కుక్, సెప్టెంబరు 18: అవమాన భారం తట్టుకోలేక ఓ వివాహిత పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు మర్కుక్ ఎస్సై దామోద ర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామానికి చెందిన కనకయ్య కొమురయ్య దంపతుల కూతురు అనూష(21) మర్కుక్ గ్రామానికి చెందిన అయ్యన్నగారి నవీన్ అనే యువకుడికి ఇచ్చి ఏడాది కిందట వివాహం జరిపించారు. అనూష చరవాణిలో వేరే వ్యక్తులతో మాట్లాడుతుందని భర్త నవీన్ ఆమెను కొట్టి అవమానపరిచాడు. అనూష ఈ విషయాన్ని నవీన్ సోదరుడు కరుణాకర్‌కు తెలిపింది. కరుణాకర్ కూడా అనూషను అనుమానిస్తూ వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి ఇంటికి తీసుకువెళ్లాలని సూచించాడు. దీంతో భర్త నవీన్ అతని సోదరుడు కరుణాకర్‌లు పెడుతున్న బాధలు, అవమానాలు తట్టుకోలేక అనూష మంగళవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగింది. వెంటనే ఆమెను చికిత్స కోసం ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి తల్లి కనకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నవీన్ అతని సోదరుడు కరుణాకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

3 నుంచి ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 18 : ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో వచ్చే నెల 3వ తేదీ నుంచి 9 వ తేదీ వరకు ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 16 నుంచి 23 వ తేదీ వరకు ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. పరీక్ష ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు ఉంటుందని తెలిపారు. గతంలో అడ్మిషన్ పొంది పరీక్షలకు హాజరుకాని వారు, పరీక్షలకు హాజరై ఫెయిలైన వారు ఈ పరీక్షలు రాయుటకు అర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ వెంకటస్వామి 8008403635 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమ్మె షురూ

- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నిలిచిన అడ్మిషన్లు



ప్రైవేటు ఆస్పత్రిలో ఉద్యోగులు సమ్మెలో ఉన్నారంటూ ఏర్పాటు చేసిన స్టిక్కర్

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 18 : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ఉద్యోగులు బుధవారం నుంచి సమ్మె బాట పట్టారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ-ఆయుష్మాన్‌భారత్ వైద్య సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు చోట్ల ఉద్యోగులు లేని కారణంగా ఆరోగ్య శ్రీ కింద రోగులను అడ్మిట్ చేసుకోలేదని ఆయా ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. మరికొన్ని ఆస్పత్రుల్లో ఆపరేటర్లకే ఆరోగ్యమిత్రల లాగిన్ ఐడీలు ఇచ్చి వైద్య సేవలు కొనసాగించినట్లు తెలిసింది.

ట్రస్టు కార్యాలయానికి తరలిన ఉద్యోగులు

ఆరోగ్యశ్రీ ఉద్యోగులు నిరవధిక సమ్మెలో భాగంగా తొలి రోజు హైదరాబాద్‌లోని ఆరోగ్య శ్రీ ట్రస్టు కార్యాలయానికి తరలివెళ్లారు. ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 46 మంది తరలివెళ్లి ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్య మిత్రల సంఘం జిల్లా అధ్యక్షుడు హిమగిరి ప్రసాద్ మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చి 42 రోజులు గడుస్తున్నా- స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వచ్చే వరకూ సమ్మె కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు రాజు, గాయత్రీ, ఎం.రాజు, వినోద్, ఖైరున్నిసా తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను మెరుగుపరుచుకోండి

- గీతం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గౌతమరావు



ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గౌతమరావు

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 18 : గీతంలో ఆర్థిక శాస్త్రం బోధిస్తున్న అధ్యాపకులు తమ బోధన, పరిశోధనా నైపుణ్యాలను మరింత మెరుగు పరచుకోవాలని గీతం ఉప కులపతి (ఇన్‌చార్జి) ప్రొఫెసర్ వైగౌతమరావు సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో మూడురోజులపాటు నిర్వహించనున్న అధ్యాపక వికాస కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గౌతమరావుతోపాటు గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, జీఎస్ హెచ్‌ఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.సన్నీ జోష్ మాట్లాడుతూ ప్రస్తుత విద్యా ధోరణులకు అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకోవడంపై దృష్టి పెట్టాలని అధ్యాపకులకు సూచించారు. ఈ మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమానికి బిట్స్ హైదరాబాద్‌లోని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ భీమేశ్వర్రెడ్డి ప్రధాన వక్తగా వ్యవహరించనున్నారు. ఈ కార్యక్రమాన్ని జీఎస్‌ఏహెచ్‌ఎస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నెల్సన్ మండేలా షణ్ముగం సమన్వయం చేశారు.

బస్సు టైరు పేలి మహిళలకు గాయాలు



గాయపడిన మహిళలను ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

హుస్నాబాద్, సెప్టెంబరు 18 ఆర్టీసీ అద్దె బస్సు టైరు పేలడంతో మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్లితే హుస్నాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు పట్టణంలోని బస్టాండ్ నుంచి కరీంనగర్ వెళ్తున్న సమయంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద ఒక్కసారిగా టైరు పేలింది. ఈ ధాటికి టైరు పైన ఉన్న రేకు పైకి లేచి సీటులో కూర్చొని ఉన్న పెద్దపల్లి జిల్లా పెగడపల్లి గ్రామానికి చెందిన బుర్ర ప్రవళిక, గోదావరిఖని సుందిళ్ల గ్రామానికి చెందిన బుర్ర కళ్యాణి, అక్కన్నపేట మండలం కుందనవానిపల్లి గ్రామానికి చెందిన మాలోతు శశిప్రియతో పాటు మరో మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సనందించారు. టైరు పేలుడు ధాటికి పెద్దగా శబ్దం రావడంతో చుట్టుపక్కల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కాగా ఈ ఘటన స్థలం వద్ద ప్రజలు, వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఆర్టీసీ డీఎం వెంకటేశ్వర్లు సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ

- వెదజల్లే పద్ధతితో వరి సాగులో రాణిస్తున్న గుమ్మడిదల రైతులు
- ఆరుతడి పంటల్లా దుక్కిలోనే సాగు..
- నీరు ఆదా.. ఆసక్తి చెబుతున్న రైతులు
- ప్రోత్సహిస్తున్న వ్యవసాయ అధికారులు

గుమ్మడిదల, సెప్టెంబరు 18 : గుమ్మడిదల అంటేనే జిల్లాలో అందరికి వ్యవసాయం మండలంగా గుర్తుకొస్తుంది. కొత్త పద్ధతులను అనుసరించి వ్యవసాయం చేయడంలో ఇక్కడి రైతులు ఎప్పుడూ ముందుంటారు. వ్యవసాయ అధికారులు సూచించిన విధానాలను పాటించి కొత్త పద్ధతులలో వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ సాగులో కొత్త మార్పులను అనుసరిస్తూ విజయం సాధిస్తున్నారు.

వెద్దజల్లే పద్ధతిలో వరి...

నాటి నుంచి వస్తున్న వరిసాగులో నారుమడి విధానానికి స్వస్తి పలికి వెదజల్లే సాగు పద్ధతిలో గుమ్మడిదల మండల రైతులు రాణిస్తున్నారు. గత ఏడాది వర్షాలు సమృద్ధిగా కురువకపోవడంతో భూగర్భ జలాలు తగ్గిపోయాయి. దీంతో యాసంగిలో రైతులు వరి సాగు అంతత మాత్రమే చేశారు. వర్షాధార పంటలైన మొక్కజొన్న మాదిరిగా వరి సాగు చేసుకోవచ్చని గత మూడేళ్లుగా వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తునే ఉన్నారు. కానీ నీళ్లు సమృద్ధిగా ఉండటంతో రైతుల ఆ పద్ధతిని అంతగా పట్టించుకోలేదు. ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా రావడం భూగర్భ జలాలు అడగంటడంతో బోరుబావులలో సైతం నీరు లభించడం లేదు. దీంతో ఈ ఏడాది ఖరీఫ్ సాగులో ఈ ప్రాంత రైతులు వెదజల్లే పద్ధతి సాగు వైపు మొగ్గు చూపారు. మండలంలోని గుమ్మడిదల, కానుకుంట, కొత్తపల్లి, నల్లవల్లి, నాగిరెడ్డి గూడెం గ్రామాలలో ఈ ఏడాది దాదాపు 700 వందల ఎకరాలలో రైతులు వెదజల్లే పద్ధతిలోనే వరి సాగు చేస్తున్నారు.

మూడు నెలల్లోనే పంట చేతికి..

వెదజల్లే పద్ధతిలో కేవలం మూడు నెలల్లోనే పంట చేతికొస్తుంది. వేసవి దుక్కుల సమయంలో పొలాన్ని మెత్తగా దున్ని మొక్కజొన్న విత్తనాలు ఏ విధంగా వేస్తారో వరి విత్తనాలు కూడా గొర్రు నాగలి వెంబడి వేసుకోవాలి. లేదా ట్రాక్టర్ సహాయంతో కూడా వేసుకోవచ్చు. కొందరు రైతులు కరిగేటలో తుకం చల్లినట్లు కూడా చల్లుకుంటారు. బోరు బావుల సౌకర్యం నీటి వసతి లేని వారు వెదజల్లే పద్ధతిలో వరిసాగు చేసుకోవచ్చు. ఇప్పటికే గుమ్మడిదల మండలంతో పాటు కానుకుంట, కొత్తపల్లి నల్లవల్లి నాగిరెడ్డి గూడెం తదితర గ్రామాల్లో వెదజల్లే పద్ధతి (దుక్కి) లో సాగు చేస్తున్నారు. నారుమడి సాగుకు కంటే దీనివల్లఎకరాకు 10వేల ఖర్చు ఆదా అవ్వడంతోపాటు 25-30 క్వింటాల వరకు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు 10 కేజీల విత్తనాలు సరిపోతాయి. అన్ని విధాలుగా బాగుండడంతో రైతులు ఈ పద్ధతిలో వరి సాగు చేస్తున్నారు. గుమ్మడిదల రైతులు పంటల్లో చీడపీడల నివారణకు ఎప్పటికప్పుడు అధికారుల సూచనలు పాటిస్తూ వరి సాగులో రాణిస్తున్నారు



వెదజల్లే పద్ధతితో గొర్రు సహాయంతో సాగు చేసిన వరి పంట..

పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది..



గుమ్మడిదల మండలంలో రైతులు వ్యవసాయ అధికారులు చెప్పినట్లు వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేస్తే పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. అంతేకాకుండా దిగుబడి బాగా పెరుగుతుంది. మండలంలో రైతులు వరి విత్తనాలు గొర్రుకు వేస్తున్నారు. గతంలో గుమ్మడిదల మండలంలో మూడేళ్ల క్రితం వరి సాగులో వెదజల్లే పద్ధతి పాటించడంలో రైతులు ఎన్నో అనుమానాలు వ్యక్తం చేశారు. కానీ, ప్రస్తుతం అధిక సంఖ్యలో రైతులు ఆ పద్ధతిని పాటించడం ఆనందం ఉంది. దీనివల్ల రైతులకు తక్కువ ఖర్చు పంట ఎక్కువ దిగుబడి వస్తుంది. అంతేకాకుండా సాగునీరు భారీగా ఆదా అవుతుంది.

-శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి గుమ్మడిదల

శ్రమ కూడా తక్కువే..



వెదజల్లే పద్ధతిలో ఇప్పటికే మా గ్రామంలో ఎక్కువ శాతం రైతులం వరి సాగు చేశాం. ఈ పద్ధతి వల్ల రైతులకు శ్రమతో పాటు తక్కువ ఖర్చు అధిక దిగుబడి వస్తుంది. వ్యవసాయ అధికారులు సలహాలు సూచనలు ఇవ్వడంతో తాము వెదజల్లే పద్ధతితో పాటు గొర్రుతో వరి విత్తనాలు వేస్తున్నాం. చాలావరకు నీరు ఆదావుతుంది. కూలీల ఇబ్బందులూ ఉండవు.

-అమ్మగారి రవీందర్ రెడ్డి, రైతు గుమ్మడిదల

ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కాంగ్రెస్ నైజం: పోతగాళ్ల రవి

వర్గల్, సెప్టెంబరు 18: ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కాంగ్రెస్ నైజమని మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోతగాళ్ల రవి పేర్కొన్నారు. ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను మండలంలోని మైలారంలో బుధవారం ప్రజలకు వివరిస్తూ గ్యాస్ సిలిండర్ రూ. 500 సబ్సిడీకి అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామస్థులకు గ్యాస్ సబ్సిడీకి సంబంధించిన పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సుప్రజ, నాయకులు పోతగాల్ల వెంకట్, పార్టీ గ్రామ అధ్యక్షుడు కుమార్ బురుగుపల్లి కనకయ్య, కనకయ్య తదితరులు ఉన్నారు.

రేబర్తిలో విఘేశ్వరుడి నిమజ్జనం

మద్దూరు, సెప్టెంబరు 18: మండలంలోని రేబర్తిలో తొమ్మిది రోజులు పూజలందుకున్న విఘేశ్వరుడిని శ్రీరామా యూత్ ఆధ్వర్యంలో భక్తి ప్రపత్తులతో డప్పుచప్పుళ్లు, ఆటపాటల నడుమ ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. అంతకు ముందు గణపతికి పూజలు నిర్వహించి అన్నప్రసాద వితరణ చేశారు.



గణపతిని నిమజ్జనానికి తరలిస్తున్న కమిటీ సభ్యులు

రాహుల్‌గాంధీని చూసి భయపడుతున్న బీజేపీ

- ఆయనపై వాఖ్యలు చేసిన వారి ఫ్లెక్సీలను దహనం చేసిన నాయకులు

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు18: రాహుల్‌గాంధీని చూసి బీజేపీ భయపడుతున్నదని, ఆయనకు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక బీజేపీ, శివసేన పార్టీ నాయకులు, కేంద్ర మంత్రులు, ఎమ్మెల్యేలు వ్యాఖ్యలు చేస్తున్నారని, కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్, పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం, జిల్లా మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పూజల గోపికృష్ణ పేర్కొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ఆదేశాల మేరకు రాహుల్‌గాంధీపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కేంద్ర మంత్రి రవణీత్ బిట్టు, బీజేపీ నేత తర్వీందర్ సింగ్, శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ ఫ్లెక్సీని సిద్దిపేట పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీని విమర్శించే ముందు బీజేపీ, శివసేన పార్టీల నాయకులు, కేంద్ర మంత్రులు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

- **గజ్వేల్:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ హత్యకు బీజేపీ కుట్ర పన్నుతున్నదని ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ ఆరోపించారు. పీసీసీ పిలుపు మేరకు గజ్వేల్‌లో బీజేపీ నేత తన్వీందర్‌సింగ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య ఉద్యమంతో ఎలాంటి సంబంధం లేని బీజేపీ కేవలం అధికార కాంక్షతో ప్రజలను కులాలు, మతాలు, ప్రాంతాలవారీగా విడగొడుతూ విచ్ఛిన్నకర శక్తిగా మారిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, తజిముల్ మస్జీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ మతీన్, మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్, నక్క రేగొండ గౌడ్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కుంట్ల లక్ష్మారెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ మహంకాళి శ్రీనివాస్, ప్రవీణ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలో మోదీ చిత్రపటాన్ని దహనం చేశారు. ఆయనవెంట కాంగ్రెస్ నాయకులు నాయిని యాదగిరి, మల్లారెడ్డి, గంగిశెట్టి శ్రీనివాస్, భాను ప్రకాశ్, రాచకొండ ప్రశాంత్ తదితరులున్నారు.

- **చేర్యాల:** ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పట్ల బీజేపీ నేత తన్వీదర్‌సింగ్, శివసేన ఎమ్మెల్యే సంజయ గైక్వాడ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. చేర్యాల పట్టణంలోని గాంధీచౌక్ వద్ద జనగామ-సిద్దిపేట జాతీయ ప్రధాన రహదారిపై బీజేపీ నేతల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా కొమ్మూరి మాట్లాడారు. దేశం కోసం పదవులను త్యజించిన రాహుల్‌గాంధీని విమర్శించడం తగదన్నారురాహుల్‌గాంధీని విమర్శించడం తగదన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు మంచాల చిరంజీవులు, మండలాధ్యక్షుడు కొమ్ము రవి, కౌన్సిలర్ ఆడెపు నరేందర్, మార్కెట్ డైరెక్టర్ పాల లక్ష్మీనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గజ్వేల్‌లో బీజేపీ నేత తన్వీందర్‌సింగ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



చేర్యాలలో బీజేపీ నేతల దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, నాయకులు

- **మిరుదొడ్డి:** రాహుల్‌గాంధీపై వివాస్పద వాఖ్యలను చేసిన బీజేపీ నాయకులపై అక్బర్‌పేట-భూంపల్లి పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమలాకర్ ఫిర్యాదు చేశారు. ఆయనవెంట చంద్రసాగర్, వెంకట్, పరుశురాములు, మహిపాల్ తదితరులున్నారు.

కుంగిన బీటీ రోడ్డుకు మరమ్మతులు



మరమ్మతులు చేసిన బీటీ రోడ్డు

చేర్యాల, సెప్టెంబరు 18: జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చేర్యాల మండలం తాడూరు క్రాస్‌రోడ్డు సమీపంలో నిర్మించిన కల్వర్టు ఆవరణలో బీటీ కుంగిపోయి ప్రమాదకరంగా మారిన విషయమై ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు పగుళ్లతో పాటు కుంగిన ప్రదేశాన్ని తవ్వకం చేసి మరమ్మతులు చేపట్టారు.

76వ వార్షికోత్సవ ముగింపు సభను విజయవంతం చేయాలి: శివలింగు కృష్ణ

గజ్వేల్, సెప్టెంబరు 18: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట 76వ వార్షికోత్సవాల ముగింపు వేడుకలను జయప్రదం చేయాలని సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలో బుధవారం సీపీఐ రాష్ట్ర నాయకుడు భట్టు దయానందరెడ్డి కలిసి ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్‌లోని తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ముగింపు సభ ఏర్పాటు చేశామని, ఈ ముగింపు సభకు రాష్ట్ర సీపీఐ కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని ఆయన తెలిపారు. ఆయనవెంట జిల్లా కౌన్సిల్ సభ్యుడు స్వర్గం రాజేశం, చింత శీను, జగదేవ్‌పూర్ మండల కార్యదర్శి నరసింహరెడ్డి, ఏఐటీయూసీ గజ్వేల్ నాయకుడు జోగు లక్ష్మణ్ ఉన్నారు.

నైపుణ్య శిక్షణా కేంద్రం ఏర్పాటుకు కృషి

- సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు



వెదురుతో తయారుచేసిన కళాకృతులను చూపుతున్న సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు18: వెదురు బొంగుల తయారీ నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసేలా సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లి, మంజూరు చేసేందుకు కృషిచేస్తానని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు తెలిపారు. ప్రపంచ వెదురు బొంగుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మోడ్రన్ బస్టాండ్ వద్ద మ్యాదరి సంఘం సిద్దిపేట జిల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వెదురు బొంగుల స్టాల్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణంలో కొద్దిమంది మాత్రమే ఈ పనిని ఉపాధిగా చేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, వెదురు బొంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొండపాక శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కోణం రాజయ్య, బీఆర్ఎస్ నాయకులు లక్కరసు ప్రభాకర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

నమ్మి ఓట్లేస్తే.. రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, సెప్టెంబరు 18: రైతులు నమ్మి రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఓటేస్తే.. వివిధ కారణాలతో రుణమాఫీ చేయకుండా రైతులను నట్టేట ముంచిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోటకమలార్‌రెడ్డి ఆరోపించారు. మిరుదొడ్డి మండలంలో రైతురుణమాఫీ కాని రైతులతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాయమాటలతో రైతులకు మభ్యపెట్టిన అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నదని విమర్శించారు. రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుని సీఎం రేవంత్‌రెడ్డి రైతు రుణమాఫీ పేరుతో ఆంక్షలను విధించడం సిగ్గుచేటన్నారు. రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మిరుదొడ్డి మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, మిరుదొడ్డి మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు పోలీస్‌రాజులు, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు బాల్‌రాజు తదితరులున్నారు.



తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

- హుస్నాబాద్ ఆర్డీవోకు గ్రామస్థుల ఫిర్యాదు



ఆర్డీవో రామ్మూర్తికి ఫిర్యాదును అందజేస్తున్న గ్రామస్థులు

అక్కన్నపేట, సెప్టెంబరు 18: మండలంలోని గౌరవెల్లిలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకుని అట్టి భూమిని గ్రామాభివృద్ధికి వినియోగించాలని కోరుతూ బుధవారం హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తికి గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ శివారులోని సర్వేనెంబర్ 139లో ఉన్న 39.39 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేసి సాగు చేస్తున్నారని, ప్రభుత్వం నుంచి ఎలాంటి పట్టాలు లేకుండానే చదును చేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు స్పందించి సర్వే చేసి అట్టి భూమిని కబ్జాదారుల నుంచి స్వాధీనం చేసుకుని గ్రామ అభివృద్ధికి ఉపయోగించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు గొల్లపల్లి వీరాచారి, బైరగోని శ్రీనివాస్, కర్ణకంటి నరేష్, మధుసూదన్, తదితరులున్నారు

నిధులు మంజూరు చేయించాలని వినతి

చేర్యాల, సెప్టెంబరు 18: కొమురవెల్లి మండలం ఐనాపూర్ శివారులోని వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరుతూ గ్రామ మాజీసర్పంచు చెరుకు రమణారెడ్డి ఆధ్వర్యంలో స్థానికులు బుధవారం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. వాగు నీటి ప్రవాహంతో రైతులు, ప్రయాణికులు ఇబ్బందులుపడుతున్నారని, బ్రిడ్జి నిర్మాణానికి చొరవ తీసుకోవాలని కోరారు. స్పందించిన కొమ్మూరి పంచాయత్‌రాజ్ మంత్రి సీతక్క దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే చేర్యాల మండలం వీరన్నపేట-చుంచనకోట వరకు 5కిలోమీటర్ల మట్టిరోడ్డు గుంతలమయమైందని, బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని మాజీ సర్పంచు కొండపాక భిక్షపతి, మంజె మల్లేశం, బుడిగె శ్రీనివాస్, సూర్ణ శ్రీకాంత్ వినతిపత్రం అందించారు.

సొంత ఖర్చులతో రోడ్డుపై గుంతలు పూడ్చిన యువకుడు

కుకునూరుపల్లి, సెప్టెంబరు 18: గుంతలమయంగా ఉన్న తమ గ్రామానికి వెళ్లే రోడ్డును యువకుడు సొంత ఖర్చులతో మట్టి పోయించాడు. కుకునూరుపల్లి నుంచి బొబ్బాయిపల్లికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా ఉండడం దీనికి భారీ వర్షాలు తోడై అధ్వానంగా తయారైంది. తమ గ్రామానికి వెళ్లే రోడ్డును బొబ్బాయిపల్లి గ్రామానికి చెందిన కన్నమైన సంపత్ తన సొంత ఖర్చులతో రోడ్డుపై ఉన్న గుంతల్లో మట్టిని పోయించి చదును చేయించాడు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తూమ్ మహేందర్, రెడ్డమైన రవీందర్, చింతల రాజు, రమేష్, స్వామి, లక్ష్మీనరసయ్య తదితరులు ఉన్నారు.

'తల్లిదండ్రులను చైతన్యపరచాలి'



కంపోస్ట్ ఎరువు తయారీని వివరిస్తున్న చైర్‌పర్సన్

హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 18: ప్రతీ విద్యార్థి పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్లాస్టిక్ వినియోగించకుండా తల్లిదండ్రులను చైతన్యపరచాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత సూచించారు. పట్టణంలోని డీఆర్‌సీసీ, కంపోస్ట్ షెడ్డు వద్ద బుధవారం ప్రైవేట్ స్కూల్ విద్యార్థులకు కంపోస్ట్ ఎరువులపై అవగాహన కల్పించారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ఇళ్ల వద్దకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు నళినిదేవి, రవి, హరీశ్ తదితరులున్నారు.

'వంట నూనెల ధరలను తగ్గించాలి'

హుస్నాబాద్, సెప్టెంబరు 18: కేంద్రంలోని బీజేపీ బతుకమ్మ, దసరా, దీపావళి పండుగల మధ్య వంట నూనెల ధరలు పెంచి పేద, మధ్య తరగతి ప్రజలను దోచుకుంటున్నదని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ ఆరోపించారు. హుస్నాబాద్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వానికి వంట నూనెల పంటలపై సమగ్ర ప్రణాళిక లేనందునే ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుందన్నారు. సమావేశంలో సుధాకర్, వెంకటేశ్, ఎలగందుల శంకర్, వేల్పుల రాజు, దొంద్ర రాజు తదితరులున్నారు.

వేదఘోషతో మార్మోగిన సద్గురుసదన్



విద్యత్ పరీక్షల్లో విద్యార్థులు

చేర్యాల, సెప్టెంబరు 18: వేదఘోషతో చేర్యాల పట్టణంలోని సద్గురు సదన భవన్ మారుమోగింది. తెలంగాణ వేద శాస్త్ర ప్రవర్ధక సభ ఆధ్వర్యంలో వేదశాస్త్ర సార్మ పరీక్షలు స్థానిక సద్గురు సదన భవనంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురు ప్రార్థన, దేవతార్చనతో సభను ప్రారంభించి లక్ష్మీగణపతి హోమం, గాయత్రీ, రుద్రహోమం, క్రమార్చన జరిపారు. విద్యార్థులకు పరీక్ష నిర్వహించిన అనంతరం సభ అధ్యక్షుడు వ్యాసోజ్జల రాధాకృష్ణశర్మ మాట్లాడారు. కార్యక్రమంలో రాచర్ల రవిచంద్రశర్మ, రాఘవశర్మ, నాగరాజుశరమ, సంపత్‌శర్మ, శ్యామ్ సుందర్ శర్మ, దేశపతి లలితామతిశర్మ, మరుమాముల రామశర్మ పాల్గొన్నారు.

'పోషకాహారంపై అవగాహన ఉండాలి'



వర్గల్: మాట్లాడుతున్న సీపీడీవో రాణి

చేర్యాల, సెప్టెంబరు 18: పోషకాహారంపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ చేర్యాల సీడీపీవో రమాదేవి అన్నారు. కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల గ్రామంలోని రైతువేదికలో బుధవారం పోషణ మాసోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేసిన అనంతరం పోషణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పోషణ అభియాన్ బ్లాక్ కో-ఆర్డినేటర్ కనకరాజు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పావని తదితరులు పాల్గొన్నారు.

- **వర్గల్:** గర్భిణులు, బాలింతలు సరైన పోషకాహారం కోసం చిరుధాన్యాలను తీసుకోవాలని సీపీడీవో రాణి సూచించారు. పోషణ మాసోత్సవాల సందర్భంగా వర్గల్ కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో వారికి అవగాహన కల్పించారు. అన్నతరం చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, మండల వైద్యాధికారి హరిత, హెల్త్ సూపర్‌వైజర్ కమల, ఏఎన్ఎం తిరుపతమ్మ, ఆశాలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నేడు నాయకులతో సమావేశం

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 18: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గురువారం నారాయణరావుపేట మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీరాములు తెలిపారు.

జగదేవ్‌పూర్: నూతన ఓటర్ జాబితాపై అన్ని రాజకీయ పార్టీల నేతలతో నేడు అవగాహన కోసం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. మండల కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరిగే అవగాహన సమావేశానికి మండలంలోని అన్ని పార్టీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

చేర్యాల:ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల విషయమై రాజకీయ పార్టీల నేతలతో నేడు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కుమారస్వామి ఒక ప్రకటనలో తెలిపారు.

స్వచ్ఛతపై అవగాహన

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 18: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం జగదేవ్‌పూర్, దౌలాపూర్ గ్రామాల్లో స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ జితెందర్‌రెడ్డి, ఆశా కార్యకర్తలు స్వరూప, నిర్మల, కవిత, పద్మావతి తదితరులున్నారు.

'కిసాన్ సంఘ్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి'

మద్దూరు, సెప్టెంబరు 18: భారతీయ కిసాన్ సంఘ్ సేవలను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అధ్యక్షుడు జశ్వంత్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని కిసాన్ సంఘ్ కేంద్రంలో బుధవారం నూతన మండల కమిటీని ఎన్నికల అధికారులు గూడ మహేందర్‌రెడ్డి, చేవూరి చంద్రగౌడ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిలుక రమేష్, కార్యదర్శిగా మెతుకు పాపిరెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సుమన్, సత్యనారాయణరెడ్డి, తిరుపతిరావు, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చేర్యాల, సెప్టెంబరు 18: జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవతో మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. పట్టణానికి చెందిన అక్కెనపల్లి సుధాకర్‌రెడ్డికి రూ.44,500, ఆడెపు శ్రావణ్‌కుమార్‌కు రూ.6వేలు చొప్పున మంజూరు చేసిన చెక్కులను మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణిశ్రీధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీవైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచు మంచాల కొండయ్య అందజేశారు.

పట్టణాభివృద్ధికి పాటుపడుతున్నాం

- మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి



సమావేశంలో చర్చిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

చేర్యాల, సెప్టెంబరు 18: పట్టణాభివృద్ధికి చిత్తశుద్ధితో పాటుపడుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి అన్నారు. చేర్యాల మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆమె అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణాభివృద్ధి, మౌలికవసతుల కల్పన, బతుకమ్మ పండుగల నిర్వహణ తదితర అంశాలపై చర్చించి పలు తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నాగేందర్, కౌన్సిలర్లు చెవిటి లింగం, మంగోలు చంటి, ఆడెపు నరేందర్, యాట కనకవ్వ, జుబేదా, ఉడుముల ఇన్నమ్మ, తుమ్మలపల్లి లీల, ముస్త్యాల తార, సతీశ్, మేనేజర్ ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

మర్కుక్, సెప్టెంబరు 18: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛహీ సేవ-2024 కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 గాంధీ జయంతి వరకు స్వచ్ఛత మీద వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అబ్దులుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల అంగడికిష్టాపూర్‌లో బుధవారం విద్యార్థులకు స్వచ్ఛ స్వభావం - స్వచ్ఛ సంస్కారం అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. విజేతలకు అక్టోబరు 2న బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలకిషన్, ఉపాధ్యాయులు, సంతోషిమాత, హారిక, చిన్నికృష్ణ ఉన్నారు.

మల్లన్నకు వెండి సామగ్రి విరాళం

చేర్యాల, సెప్టెంబరు 18: కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయానికి వరంగల్ జిల్లాకు చెందిన కొండి శ్రీధర్ దంపతులు రూ.85వేలు విలువగల వెండి ఆభరణం, పూజా సామగ్రిని విరాళంగా అందించారు. ఈ సందర్భంగా అర్ధకిరీటం, తీర్థపు చెంబును బుధవారం ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్ సమక్షంలో ఆలయ సూపరింటెండెండ్ శ్రీరాములుకు అప్పగించడంతో ఆయన వారికి రశీదు, స్వామివారి ప్రసాదం అందించారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

చిన్నకోడూరు, సెప్టెంబరు 18: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. చిన్నకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈవో దేశిరెడ్డి, ఏంఎన్‌వో తిరుపతి, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, పీఈటీలు, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

- **మద్దూరు:** మండల కేంద్రంలోని ఆదర్శపాఠశాలలో మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడోత్సవాల టోర్నమెంట్‌తో పాటు సెలక్షన్స్‌ను రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు మండల ఎంఈవో ఉదయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు.
- **సిద్దిపేట రూరల్:** ఈ నెల 20 నుంచి నారాయణరావుపేట మండల ఎస్‌జీఎఫ్ ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి యాదవరెడ్డి తెలిపారు.
- **కుకునూరుపల్లి:** మండల కేంద్రంలో నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల కరపత్రాని జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం ఆవిష్కరించింది.
- **మిరుదొడ్డి:** ఈ నెల 23, 24న మండల స్థాయి క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంఈవో ప్రభుదాస్ తెలిపారు
- **తొగుట:** తొగుట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 19 నుంచి 20 వరకు ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తొగుట ఎంఈవో సత్తు యాదవరెడ్డి తెలిపారు.
- **జగదేవ్‌పూర్:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలను తిగుల్‌లో నేటి నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంఈవో ఉదయభాస్కర్‌రెడ్డి తెలిపారు.
- **దూళిమిట్ట:** మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 20వ తేదిన మండల స్థాయిలో క్రీడలను నిర్వహిస్తున్నట్లు ఎంఈవో తగిరెడ్డి దేశిరెడ్డి తెలిపారు.

డ్రగ్స్, మత్తు పానీయాలకు దూరంగా ఉండాలి

- విద్యార్థులకు పోలీసుల సూచన

గజ్వేల్, సెప్టెంబరు 18: డ్రగ్స్, మత్తుపానియాలకు యువత దూరంగా ఉండాలని గజ్వేల్ అదనపు ఇన్‌స్పెక్టర్ ముత్యంరాజు పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలోని జూనియర్ కళాశాల బుధవారం యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించిన అనంతరం గోడపత్రికను కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్‌తో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దన్నారు.

- **కొండపాక:** గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ సూచించారు. మండలంలోని దుద్దెడ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- **కోహెడ:** డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఐ అభిలాష్ పిలుపునిచ్చారు. కోహెడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల వినియోగం, మద్యపానం, ధూమపానం దుష్ప్రభావాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ యాదగిరి, అధ్యాపకులు రాజేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రజిత, నీరజ, యు. శ్రీనివాస్, ఎస్. శ్రీనివాస్, అశోక్, సీతారామయ్య నరేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాజమౌళి, లైబ్రేరియన్ సుజాత పాల్గొన్నారు.
- **అక్కన్నపేట:** మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని అక్కన్నపేట ఎస్ఐ విజయభాస్కర్ సూచించారు. మండలంలోని అంతకపేట ప్రభుత్వ పాఠశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



గజ్వేల్: జూనియర్ కళాశాలలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ ముత్యంరాజు, అధ్యాపకులు



కొండపాక: మాట్లాడుతున్న సీఐ విద్యాసాగర్

- **రాయపోల్:** యువత మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవద్దని రాయపోల్ ఎస్ఐ రఘుపతి సూచించారు. అనాజీపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- **చేర్యాల:** విద్యార్థులు మత్తుపదార్థాలకు అలవాటుపడవద్దని, చదువుపై దృష్టి సారించి ఉత్తములుగా ఎదగాలని చేర్యాల ఎస్ఐ నీరేశ్, కొమురవెల్లి ఎస్ఐ రాజుగౌడ్ సూచించారు. చేర్యాల మండలం ముస్త్యాలలోని ఆదర్శ పాఠశాలతో పాటు కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల జడ్పీఎస్ఎస్‌లో ఇరువురు వేరువేరుగా యాంటీ డ్రగ్స్ కమిటీతో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్



ఓటుహక్కు వినియోగించుకోవడానికి క్యూలో నిల్చున్న విద్యార్థులు

తొగుట, సెప్టెంబరు 18: తొగుట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎన్నికలు నిర్వహించగా విద్యార్థులు ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలో ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 12:30 గంటల వరకు సాగింది. అనంతరం బ్యాలెట్ బాక్సులను ఓపెన్ చేసి ఓట్ల లెక్కింపు ప్రక్రియను విద్యార్థులే పూర్తి చేసి విజేతలతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉపేందర్, ఉపాధ్యాయులు మురళీధర్, భగవాన్, మల్లేశం, మోహన్, రాంచెంద్రం, శ్రీనివాస్, సుఖేందర్ రెడ్డి, కవిత, నాగలక్ష్మి, అనురాధ, విశ్వరూపం, సత్యనారాయణరెడ్డి, శివకుమార్, సీఆర్‌పీలు బాలకృష్ణ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 18: సిద్దిపేట డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి చింతమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కొత్త రాజిరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ.. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న దుంపటి రుక్మిత అండర్-14 80 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం, జెల్ల అవంతిక 3 వేల మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించి ఈ నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ వెంకటస్వామిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు బాలరాజ్, అజీజ్, సత్తయ్య రాందాస్, రాంరెడ్డి, శ్రీహరి, రాజు, శ్రీనివాస్‌రెడ్డి, రేణుకా పోచయ్య, శ్రీశైలం, కృష్ణ మని, హరికృష్ణ, కిషోర్ తదితరులు అభినందించారు.

'బీడీ కంపెనీని మూసేయొద్దు'

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 18: ఎంతోమంది మహిళలకు జీవనాధారమైన భాషా బీడీ కంపెనీని మూసివేస్తే కార్మికుల బతుకులు అగమ్య గోచరంగా మారుతాయని హెచ్ఎంఎస్ బీడీ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఈశ్వర్ ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ యాజమాన్యం తీరును నిరసిస్తూ బుధవారం సిద్దిపేటలో లేబర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు దారి చూపకుండా కంపెనీని మూసివేస్తే కార్మికుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఉన్నపలంగా కంపెనీని మూసివేస్తున్నామని, రాజీనామా చేయండని భాషా కంపెనీ యాజమాన్యం కార్మికులపై ఒత్తిడి తేవడం సరికాదన్నారు. ఇప్పటికైనా భాష బీడీ కంపెనీని కొనసాగించాలని లేనిపక్షంలో చట్ట ప్రకారం యాజమాన్యంతో కార్మికుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ జాతీయ కార్యదర్శి సుదర్శన్ రావు, జిల్లా అధ్యక్షుకుడు ఇదారి మల్లేశం, హెచ్ఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మధు, కార్యదర్శి లక్ష్మణ్, బీడీ కార్మికులు కనకలక్ష్మి, జయమ్మ, బండి బాలమణి, లీలావతి, మంగవ్వ, రాజేశ్వరీ, లహరి, కనక లక్ష్మి, రేణుక, టేకేదారులు, కమిషన్ ఏజెంట్లు వెంకటేశం, కృష్ణమూర్తి, ప్రభాకర్, దుబ్బ రాజం, రవి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.